


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

103

(17 ' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ఒక్క రసం మాటేమిటి?** ఆయనగారు ఒక్కరోజులో నవరసాలు గుమ్మరించగలరు. 'మావారు' అని చెప్పుకోవడం కన్నా 'మహానటులని' చెప్పుకుంటే మంచిది.

"పైగా ఏ రోజు ఏ పోర్షన్ అప్పగిస్తారో ఏ రోజు ఏ రసం ప్రదర్శిస్తారో చెప్పడం కష్టం. అది అలా వచ్చేస్తుంది. మహా తరంగంలాగా. ఆ రసంలో లీనమైపోతారు. ఇవతల వాళ్ళు గుడ్లూ, చెవులూ అప్పగించి ఊరుకోవలసిందే"

మొన్న ఆదివారం పిల్లలందర్నీ పెందరాళే లేపి, మొఖాలు కడిగించి, కాఫీ త్రాగించి, మంచిబట్టలు తొడిగించి, అందర్నీ కాఫీ హోటల్‌కు తీసుకువెళ్ళారు. తలుపు దగ్గర చూస్తూ "ఈ పూట నువ్వేం ఫలహారం చెయ్యక్కరా మేం తెస్తాం అందాకా వారపత్రిక చదువుకో" అని ఎంతో ఆప్యాయత ఒలకబోసి వెళ్ళారు. వాళ్ళందరికీ అడిగిందల్లా తినిపించి, తను తిని నాకో రూపాయి దాణా తెచ్చారింటికి. అంత కరుణ ఎలా వచ్చిందో చెప్పలేను. కాపరానికి వచ్చిన క్రొత్తలో కూడా అంత కరుణా, ప్రేమా అనుభవించినట్లు జ్ఞాపకం లేదు.

ఆయన నవ్వుతూ దగ్గిర కూర్చుని అవన్నీ నాచేత తినిపిస్తుంటే "పిచ్చిదానికి తలంటి" శాస్త్రం జ్ఞాపకం వచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం దాకా ఆ గుణం అలా నిలబడే ఉంది. వంటచేసి అవస్థపడుతున్నానని కూర తరిగి అందించారు. పులుసులోకి చింతపండు పిసికి అక్కడ పెట్టారు. ఇలా ఎంతో సహకారం ప్రదర్శించారు. ఆ తర్వాత ఆఫీసుకి వెళ్ళారు. ఆ రసం అక్కడితో సమాప్తి.

సాయంత్రం రావడం రావడమే హిరణ్యకశ్యపుని వేషంలో వచ్చారు. వాకిట్లో వున్న పిల్లల్ని తలొకటీ వేశారు. "పాడు సంతానం, కీడు సంతానం" అని తిట్టిపోశారు. అప్పుడు లోపలకు వచ్చి వెంటనే "నిన్ను చేసుకోవడం బుద్ధి తక్కువ అయింది" అన్నారు.

"నిజమే" అన్నాను.

"మీకెంత సేవ చేసినా ప్రయోజనం లేదు. కృతజ్ఞతలేని జీవులు. ఈ కొంపేమిటి, ఈ సంతానమేమిటి? ఎలా మగవాడు బ్రతకడం?" అని తిట్టిపోశారు.

కాఫీ తెచ్చి ఇస్తే "ఎందుకీ గరళం? నాకేం అక్కరలేదు" అంటూ అక్కడ నుంచీ చివాలున వెళ్ళిపోయారు. పిల్లలకు చదువు ప్రారంభం. మొదటగా అయిదేళ్ళ కుంకను గట్టిగా పట్టుకుని "ఎక్కడరా! హిమాలయాలు? చెప్పరా శుంఠా లేదా నీ చెంప పగిలిపోతుంది" అని రెండు గుంజీలు గుంజి "ఎక్కడరా హిమాలయాలు కిరాతుడా! మీ అందర్నీ "డల్స్‌ను" కన్నది అక్షరజ్ఞానం లేదు. ఎక్కడరా హిమాలయాలు?" అని గుడ్లు ఉరిమాడు.

"అమ్మా" అని ఏడవడం మొదలుపెట్టాడు. ఆయనకు కోపం మరింత ఎక్కువైంది.

"అమ్మను ప్రార్థిస్తున్నావా అప్రాచ్యుడా మీ అమ్మేకాదు. ఆ బ్రహ్మ దిగివచ్చినా నిన్ను వదిలేది లేదు. ఎక్కడ హిమాలయాలు?" అని ఒక్క వూపు వూపడంలో వాడు క్రిందపడి చివరకు "దొడ్లో" అన్నాడు.

"దొడ్లోనా చూపించు" అని వాణ్ణి నేలమీద వేసుకుని ఈడ్చుకుపోయాడు దొడ్లోకి. నేలమీద కాలితో బలంగా తన్నుతూ "ఎక్కడరా దుర్మార్గుడా ఎక్కడ హిమాలయాలు?" అంటుండగా నేను వెళ్ళి "ఎందుకు వాణ్ణి అలా చంపుతారు వాడికేం తెలుసు ఎక్కడున్నాయో. చదివేది ఓనమాలు, హిమాలయాలు అడిగితే ఏం చెపుతాడు?" అన్నాను.

"అయితే మాత్రం జనరల్ నాలెడ్జి వుండొద్దు. ఇప్పుడెన్ని పరీక్షలు పాసయినా జనరల్ నాలెడ్జి లేందే ఏ ఉద్యోగం రావడం లేదు. నేనింకా అందరికీ తెలిసిన హిమాలయాల సంగతి అడిగాను. అక్కడ ఎవరికీ తెలియని ప్రశ్నలడుగుతారు. ఇప్పటినుంచే జనరల్ నాలెడ్జి మారిపోయాలి" అన్నారాయన.

ఆ రాత్రి అన్నం వేళదాక అయిదేళ్ళవాడి దుంప తెంపి అప్పుడు మ్యాపులో హిమాలయాలు చూపించి వదిలారు. వాడు నిద్రల్లో "హిమాలయాలు" అంటూనే వున్నాడు.

"ఇలాంటి సంఘటనలెన్నో మా యింట్లో మా వారికి ఒక రసమేమిటి? అన్ని రసాలూ తెలుసు. అయితే సరసం కంటే విరసం పాళ్ళు ఎక్కువ" అని ఆ ఇల్లాలు మొత్తుకుంది పాపం.

ఇలాటి తిట్లతో, శాపనార్థాలతో గడిచిపోయే సంసారాలు కొన్ని వున్నాయి. చెయ్యి చేసుకునే ప్రబుద్ధులు కొందరుంటారు. "వంట్లో విరిగిన బొమికేగానీ విరగని బొమికలేదు" అని వేదనపడే ఇల్లాండ్రు ఎంతమందో వున్నారు.

చాలాకాలం క్రితం క్రింద ఏడెనిమిది మంది పిల్లల తల్లి ఒక బంధువురాలు మా ఇంటికి వచ్చింది. చాలాకాలానికి వచ్చిందని బ్రతిమాలి ఆ రోజు ఎలాగో ఆపాం. మర్నాడు ఉదయం ఒక రవికకు సరిపోయే 'కట్‌పీస్' ఒకటి కొని బొట్టి పెట్టి ఇచ్చారు మావాళ్ళు. ఇంకా రెండురోజులు వుంటే బాగుండేదన్నారు.

దానికా ఇల్లాలు "ఇంకా నయం నిన్ననే ఆయన చాలా అవస్థపడి వుంటారు ఎట్లా కాలం గడించిందో ఏమో!?" అంది.

"ఒక్క రోజేగా ఎక్కడో అక్కడ తింటారు. ఊళ్ళో చుట్టాలున్నారుగా" అన్నాం.

"తిండి విషయంలో కాదు. తిండి ఎవరైనా పెడతారు. తిట్లూ, తన్నులూ ఎవరు తింటారు? ఇటీవల కాలంలో నిన్న ఒక్కరోజు నాకు దెబ్బలు తప్పింది.

"ఒక్కొక్క రోజు మరిచిపోయి నిద్రపోయినా అర్ధరాత్రి లేచి, ఏదో తగాదా పెట్టుకుని, నాలుగు తన్ని, పళ్ళు పటపట కొరికి, అక్కడికీ కసితీరక, జుట్టుపీకి, తలగోడకు వేసి కొట్టి అప్పుడుగానీ నిద్రపోరు" అని ఆమె కంట తడిపెడుతూ చెప్పింది. ఆవిడ దుర్దశ అప్పుడు తెలిసింది. దాంతోపాటు ఆయనగారి సంస్కారం కూడా.

"కలకంటి కన్నీరొలికిన సిరులు యింట నుండనొల్లదు" అన్నారు పెద్దలు. కన్నీరు ఒలకడమే కాదు ఇంట్లో నదిగా ప్రవహించినా, సిరి తొలిగిపోని ఇళ్ళు చాలా వున్నాయి. అసలు సిరిని చూసుకుని ఆలిని తన్నడమంటే, కళ అభివృద్ధి చెందుతుందేమోననిపిస్తుంది.

మరి పైన చెప్పిన పద్యభాగంలో సిరికి వేరే అర్థం చెప్పుకోవాలో లేకపోతే సిరి తన పద్ధతులు మార్చుకుందో చెప్పలేం. కొందరికి సరసం ఇలా పతాకస్థాయినందుకుంటుంది.

అయితే ఇలాటి పరిస్థితులు మన దేశంలోనే కాదు అన్ని దేశాలలో, అన్ని కాలాలలో వున్నాయి. వెనుక రష్యాకు రాణిగా వెలిసిన కాథరిన్ కూడా ఇలాటి అవస్థలు పడిందిట భర్త డ్రాంక్ డ్యూక్ పీటర్ ద్వారా.

సర్వసామాన్యమైన వనితగా రష్యా చేరి, పీటర్‌ను పెళ్ళాడింది. చాలామంది పిల్లల్ని కన్నది. కానీ పీటర్ చేతిలో తన్నులూ, తిట్లూ తప్పలేదు ఒక్కరోజు కూడా. ఆ ప్రబుద్ధుడు సంతానాన్ని చూసి "వీళ్ళు నా సంతానం కాదనేవాడట. భార్యను పదిమందిలో పట్టుకుని బండకూతలు కూసేవాడట.

"నీకు విడాకులన్నా ఇస్తాను. లేదా ఏదైనా కాన్వెంటులోనన్నా పారేస్తాను పాపిష్టురాలా" అని సభల్లో, విందుల్లో తిట్టి జుట్టుపట్టుకుని ఈడుస్తూ వుండేవాడుట. మొత్తం మీద ఇద్దరికీ ఒక్క ఘడియ సఖ్యత కుదిరేది కాదుట. భర్త దుర్మార్గుడైతే అలాటి రాణికే టికాణా లేకపోయింది. ఇంక మామూలు వాళ్ళకా!

ఇళ్ళలో దంపతుల మధ్య సరస ప్రసంగాలు అనేది అదృష్టం కొద్దీ లభించే ఒక వరం. అది తప్పితే జీవితమే శాపం.

Post your comments